

మండుతున్న పొయ్యిలా వుంది తూరుపు దిక్కు. మంటల్లోంచి లేచిన పొగలా మేఘాలు తేలిపోతున్నాయి. ఎగిసే నిప్పురవ్వల్లా పక్షులు గాలిలో ఎగురుతున్నాయి. అరుణకిరణాలు పడి ఉతికి ఆరేసిన చెంగావిరంగు సిల్కుచీరలా మెరుస్తోంది నాగావళి.

సిమ్మడు మండుతున్న పొయ్యి మీద మురికి బట్టలు నింపిన పెద్ద 'గూన' పెట్టి కొన్ని ఎండుపుల్లలు పొయ్యిలో వేసి మంట ఎక్కువ చేశాడు. ఉదయకిరణాలు పొయ్యిలోని మంటలూ ఆ పరిసరాలను మరింత ఎరుపెక్కించాయి.

మండుతున్న పొయ్యిలాగే సిమ్మడి మనసు కూడా మండుతోంది. మురికిబట్టలు దండదాని కెల్లి నాయుడు బావుకి జీతమడిగితే నాయుడన్నమాటలతో ఇంకా మనసు మండుతూనే వుంది. నాయుడి మీద కోపం ఉబికుబికి వస్తోంది. కానీ ఏం చెయ్యగలదు...!

చాకలి కారం... సున్నం... వేసిన మురికి బట్టలు పొయ్యి మీద గూనలో వుడికి ఆవిర్లు లేస్తున్నాయి అతడి ఆవేశానికి వంతపాడుతున్నట్లు.

ఆ ప్రక్కనే ఏటి ఒడ్డున పొలంలో దుక్కి దున్నుతున్న రైతు వచ్చి పొయ్యిలోని నిప్పు తీసి చుట్టకాల్చుకుని "సిమ్మడో" అని పిలిచేడు. సిమ్మడికా పిలుపు వినబడ లేదు వాడి ఆలోచనల్లో. మళ్ళీ పిలిచేడు రైతు. ఉలిక్కి పడి చూసేడు సిమ్మడు... చూసి "ఏటి అప్పల సొంబావూ" అన్నాడు.

"ఏట్రా ఆలోసించుతన్నావు అంత దీనిగ. మీ యావిడికింకా నీర్సం తగ్గనేద్రా!"

"నేదు బావూ. దానికా సంకటం సోదు. నాకు మంచిరోజా రాదుగావాల" అన్నాడు నిరాశగా సిమ్మడు.

"ఐతేటి, మందు గట్రా ఇప్పించనేద్రా?"

"మందిప్పించడానికి నా దగ్గరేటున్నాది. రెండు సంది పిల్లలుండీ సంతే. ఆ సెసిరెంటుబావు దరమ్మ కట్టుకున్నాడు సెసరసేని పాడు సేసెత్తన్నాయని. మరే టుంది. నీకాడ నీకాడ సదీ సరక తీసుకోని సంతులు బావుకి బతిమాల్తే ఇండీసను సేసినాడు నిన్న. నాయుడు బావుకి జీతమడిగితే ఆ బావు కెంతొచ్చిందంతావు కోసం. వుంచుకుంతాడు గావాల వుంచుకోని. సిన్న కూతురు సమర్తాడినప్పుడు మూలసోసిన దాన్నిను వుంచుకున్నాడు గాదూ. వుంచుకోని... వుంచుకోని మేడలు కట్టేసి" అని ఆగి పొయ్యిలో ఆరిన మంటను వూది ... రెండు ఎండు పుల్లలు వేసి రాజేసేడు. ఊదుతున్నప్పుడు కంట్లో ధూళి పడి కళ్ళు ఎర్రగా తయారయ్యాయి.

ఏటి అలల మీది నుంచి తేలివచ్చే గాలి చెమట బిందువులతో నిండిన అతని వొళ్ళు నిమిరి మెల్లగా సాగిపోయింది. అతని కండలు తిరిగిన దేహం మీది...



# విముక్తి

—గంటేడ గౌరునాయుడు

5-5-89 ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక

చెమట బిందువులలో ఎండ పడి మెరుస్తోంది.

అప్పిలికి ఒంట్లో బాగా లేకపోవడంతో అందరితో కలిసి 'రేవు' పెట్టలేకపోయాడు పిమ్మడు. వాయు శ్యారుకోకపోవడంతో ఆ రోజు 'రేవు'పెట్టేడు. ఒక్కడే కావడం వల్ల కూడా మహా చిరాగ్గా వుందీరోజు పిమ్మడికి.

"ఒరే పిమ్మడూ... ఇదిగో బాడీ..దట్టి గుంజీ పిచ్చిమి" అని వొంటి మీది బాడీ.. పై మీది తువ్వాలు పిమ్మడి ముందు పడవేసి దువ్వుకోడానికి వెళ్ళిపోయాడు రైతు అప్పలస్వామి. పిమ్మడు పొయ్యి మీది గూనలోంచి బట్టలు తీసి ఏటి ఒడ్డున పెట్టి రేవులోని రాతి బల్ల మీద బట్టల్ని వుతకసాగేడు. రాతి బల్ల మీద దరువేస్తున్నప్పుడు హుషారుగా వుండేటందుకు ఓ మాంచి పాట అందుకునే వాడు పిమ్మడు. కానీ ఇప్పుడు యాంత్రికంగా పని చేసుకుపోతున్నాడు. అప్పిలి వుంటే హుషారుగా వుండేది వాడికి. అప్పిలి కెలాగుందో. పక్కింటి రేగమ్మకు సెప్పాను. అది వెగిపివంతరవాత మందు పట్టమని ఇచ్చిందో, వేదో" అనుకున్నాడు.

పెళ్ళైన కొత్తలో ఎలాగ వుండేది అప్పిలి. గెంజిపట్టి యిస్త్రీ సేపిన కోకలాగ పిటపిటలాడుతుండీది. విగవిగ లాడీది. అప్పిలితో కలిసి పాడుతూ చాకిరేవు బల్ల మీద బట్టలు వుతుకుతుంటే ఆ రేవుకే అందమొచ్చీది కాదూ" అప్పిలితో ఇకటాలాడుకోని పనిసేత్తే 'పని' తెలిసేదే కాదు. సూసినోలంతా ఎంత యిదైపోయీరోలు. అలాపింటి అప్పిలికి ఏమైవాదో ఏటో మంచం పట్టేసింది. "ఎవులేటన్నారే" అంతే ఏటీ సెప్పదు. బట్టలు గుంజడం మానీమంతాది. నేకపోతే జీతాలకి కాకుంట "జత కింత" అని సెప్పి గుంజమంతాది. "కుల వుర్తి" మానిత్తే ఎలాగ? ఆలోచనలతో బట్ట లుతకడం ఆపేసేనని గుర్తొచ్చి మళ్ళీ వుతకడం ఆరంభించాడు.

దూరంగా జాలర్లు వలలు విసురుతున్నారు. ఏటి మధ్య లకుముకి పిట్ట అంతెత్తు నుంచి గురి సూస్తూ చెట్టు నుంచి రాలిపడ్డ పండులా దబ్బున నీళ్ళలో పడి చేపలువేటాడుతోంది. నీళ్ళ మీద చేపలు తుళ్ళి తుళ్ళి ఎగిరిపడుతూ మిలమిలా మెరుస్తున్నాయి. 'ఆ 'పిత్త పరిగెల్ని' సూస్తే అప్పిలి కళ్ళే గుర్తుకువస్తాయి పిమ్మడికి.

బట్టలన్నీ బల్ల మీద వుతికి గంజిపెట్టి, నీలిమందులో ముంచి ఆరవేసేసరికి పొద్దు నడినెత్తికొచ్చింది. పిమ్మడు మొలలోతు నీళ్ళలోకి వెళ్ళి బుడుంగన మునిగి స్నానమైందనిపించి వుదయం తెచ్చిన పట్టిలోని సల్లంది గెంజి వుల్లిపాయ కొరికి తాగి గ్రరుని త్రేన్చేడు. త్రేన్చి దప్పికి తోటి 'వుల్లిపాయ' మా 'దుమా' గుంతాది సుమీ అనుకున్నాడు. ఒడ్డునున్న మామిడి చెట్టు మొదట్లో కూర్చుని బీడీ వెలిగించి ఓదమ్ము లాగేడు. గట్టిగా పీల్చి వదిలిన బీడీ పొగలో ఓసారి తన అప్పిలి ముఖాన్ని సూసుకున్నాడు. కొంచెంసేపు అప్పిలిని గురించి ఆలోచించి "బేగింటికెల్లాల" అనుకొని ఆరిన బట్టల్ని మడతలు పెడుతుండగా వచ్చాడు పదేళ్ళ పక్కింటి సంగడు వగరుస్తూ వస్తూనే అన్నాడు—

"పిమ్మన్నా అప్పలొదిని జూవాయించిపోయింది. వులుకూనేదు, పలుకూనేదు. నిన్ను గభీని పిలిసికి రమ్మని పంపింది మాయమ్మ" అని వచ్చినంత వేగం గామా వెళ్ళిపోయాడు సంగడు.

ఓర్నాయన.. ఏమైందో దానికి" మజ్జిగెరమ్మ తల్లీ అప్పిలిని సల్లగ సూడు తల్లీ. దానికి జబ్బు తగ్గింతర్వాత కోడీ..కోక పట్టుకోని నీ దగ్గిటికొత్తాము" అని రాయఘుడ మజ్జిగొరి గుడి వున్న దిశగా తిరిగి మొక్కి ఆదరాబాదరాగా బట్టలన్నీ రెండు మూటలుగా కట్టి

